## క్లుప్తంగా

### ఆర్టీసీ టూరిస్ట్ బస్సులను వినియోగించుకోండి

పుంగనూరు: మదనపల్లె రెండవ డిపో నుంచి వేసవి సెలవులకు టూరిస్ట్ బస్సులను ప్రారంభిస్తున్నట్లు డీఎం నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉద్యోగస్తులు, విద్యార్థులకు అనుకూలంగా ఉండేందుకు ఈనెల 12, 13, 14, 15 తేదీల్లో ఊటీ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. రానుపోను టికెట్ ధర రూ.2,250లని తెలిపారు. ఆసక్తి గల వారు మదనపల్లె అసిస్టెంట్ మేనేజర్ ఆర్.గీత సెల్ నంబర్ 9160186645కు సంప్రదించి సీట్లు రిజర్వ్ చేసుకోవాలన్నారు.

### డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తులు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఏ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కోర్సులలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించి, అడ్మిషన్లు పొందాలని తెలిపారు.

### పలమనేరు చిన్నారుల ప్రతిభ



షీల్డులు సాధించిన చిన్నారులు

పలమనేరు: అబాకస్ ఇంటర్నల్ పోటీల్లో పట్టణానికి చెందిన యూసిమాస్ అబాకస్‌కు చెందిన యాభై మంది చిన్నారులు ఉత్తమ ప్రతిభను చూపినట్టు యూసీఎంఏఎస్ ఫ్రాంఛైజీ డైరెక్టర్, ఏపీ, తెలంగాణ హెడ్ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వాసవీ ట్రస్టు నిర్వాహకులు ప్రతిభ చూపిన చిన్నారులకు షీల్డులు బహూకరించారు.

### దత్తమునీంద్ర ఆశ్రమంలో పూజలు



రామకుప్పం: అత్తికుప్పం గ్రామం ఓంకార దత్త మునీంద్రా ఆశ్రమంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. మండల పూజ సందర్భంగా గురుదత్త, వినాయక, లలిత, పరమహంస విగ్రహాలకు విశిష్ట అలంకరణ చేశారు. ఉదయం నవగ్రహశాంతి హోమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### బోర్డర్ చెక్‌పోస్టుల తనిఖీ



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఏఈఎస్ ఆయిషాబేగం

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని అంతరాష్ట చెక్‌పోస్టులను అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంటెంట్ ఆయిషాబేగం స్థానిక అధికారులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. కర్ణాటకలో ఎన్నికల నేపథ్యంలో అక్కడి సిబ్బందికి బోర్డర్‌లో తనిఖీలపై తగిన సలహాలు, సూచనలు చేశారు. ఆమె వెంట స్థానిక సెబ్ సీఐ ఎల్లయ్య, చెక్‌పోస్టు సీఐ ఎస్ఎం బాషా సిబ్బంది ఉన్నారు.

### ఉపాధి పనులు వేగవంతం



ఉపాధి రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

గుడుపల్లె: ఉపాధి పథకంలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రమణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నల్లగాంపల్లె సమీపంలో జరుగుతున్న ఫ్లిడర్ చానల్ పనులను తనిఖీ చేశారు. అనంతరం బెగ్గిలిపల్లె సచివాలయాన్ని సందర్శించి ఎస్‌డీజీ సర్వే నిర్వహణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యదర్శి చంద్రప్ప, ఉపాధి అధికారులు పాల్గొన్నారు.


### ఆధార్ కేంద్రానికి విశేష స్పందన



ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీ వినాయకపురం ఎస్టీ కాలనీలో నిర్వహించిన ఆధార్ ప్రత్యేక శిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం వినాయకపురం ఎస్టీ కాలనీలో అధికారులు ఆధార్ శిబిరం నిర్వహించారు. తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఉచిత వైద్య, పశు వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. పశువులకు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పశువైద్యాధికారి చందన ప్రియ, సోమల పీహెచ్‌సీ వైద్యాధికారి జయసింహా, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, కార్యదర్శి జైశంకర్, ఏపీఓ దినకర్ బాబు పాల్గొన్నారు.

# భవిష్యత్‌లో గృహసారథులే కీలకం



పుంగనూరు: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు: సమావేశంలో పాల్గొన్న కన్వీనర్లు, గృహసారథులు

- హామీలను నెరవేర్చారు గనుకే సీఎం జగన్ ప్రజల వద్దకు పంపుతున్నారు
- మరి చంద్రబాబు ఎందుకు ఆ పని చేయలేదు ?
- ఎల్లో మీడియావి అభూత కల్పనలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: భవిష్యత్‌లో గృహసారథులు, కన్వీనర్లు ప్రజలకు చైతన్యం కలిగించడంతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించడంలో కీలకపాత్ర పోషించాలని రాష్ట విద్యుత్, అటవీ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు అతిథులుగా పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ గత నెలలో చేపట్టిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98.44 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వం 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. దానికి తోడు టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దోచుకుతిన్నాయని ఆరోపించారు. మరి చంద్రబాబు ఎందుకు వైఎస్ జగన్‌లా పనిచేయలేదని నిలదీశారు. కానీ ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ5, ఏబీఎన్ చానెళ్లు అభూత కల్పనలతో చంద్రబాబును మోస్తున్నాయని తెలిపారు. గతంలో ఎన్నికలప్పుడు మాత్రమే ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు పథకాలు అందించేవారని, కానీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందించి అన్ని వర్గాలను ఆదుకుని, ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లేందుకు అవకాశం కల్పించారని మంత్రి ఈసందర్భంగా కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మృతి తరువాత పాలకులు ఆరోగ్యశ్రీని కనుమరుగు చేశారని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ పథకంలో రెండువేల జబ్బులను కలిపి రూ.1000 నుంచి లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించడంతో పాటు బయట ఆస్పత్రులకు అనుమతి ఇచ్చారన్నారు. అందువల్ల గృహసారథులు, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి మన ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని కోరారు.

**30 ఏళ్ల ఆ కుటుంబం ఏమి చేసింది ?**

ముప్పై ఏళ్లుగా ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పని చేసిన ఒకే కుటుంబం పుంగనూరును ఏమి అభివృద్ధి చేసిందని మంత్రి పెద్దిరెడ్డి నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మారుమూల గ్రామాలకు రోడ్లు, కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు నేతిగుట్లపల్లె, ఆవులపల్లెలో రెండు రిజర్వాయర్లు నిర్మించిన ఘనత మా ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు.

సమావేశంలో రాష్ట జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

# నాలుగేళ్లలో 40 ఏళ్ల అభివృద్ధి చేశా!



చౌడేపల్లెలో గృహసారథుల సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప

చౌడేపల్లె: పుంగనూరు నియోజకవర్గంలో 40 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధిని నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేశానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం చౌడేపల్లె ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాల కన్వీనర్లు, పార్టీ నేతలతో సమావేశం జరిగింది. ఇందులో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఊహించని రీతిలో అభివృద్ధిచేశామన్నారు. ఒకే కుటుంబం 30 సంవత్సరాలు పుంగనూరును పాలించారని అభివృద్ధి ఎక్కడ చేశారని ప్రశ్నించారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను పెట్టి నాయకులచే అప్పట్లో ప్రారంభోత్సవాలు, విందుభోజనాలు ఏర్పాటుచేసుకుని సంబరాలు చేశారని ఎద్దేవా చేశారు. చేసిన అభివృద్ధిని చూసి రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపి మళ్లీ సీఎంగా అవకాశం ఇవ్వాలని కోరారు. చిత్తూరు ఎంపీ ఎన్. రెడ్డెప్ప, పార్టీ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్ వరుణ్‌భరత్, కల్యాణ్‌భరత్, సాధిక్‌బాషా, అల్తాఫ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# మీకు నీడలా తోడుంటా!



ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మీకు ఏ కష్టమొచ్చినా మీ వెంట నేను నీడలా ఉంటా, మీ ఇంటి పెద్దకొడుకులా మిమ్మల్ని ఆదుకుంటా, ధైర్యంగా సమస్యలను నాతో చెప్పండి వెంటనే పరిష్కరిస్తానంటూ ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం బైరుపల్లి పంచాయతీలోని మాధకుప్పం, యాదకుంట, తుపాకీ చిన్నేపల్లి, బంగ్లాఊరు గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి నిర్వహించారు. 383 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏదైనా సమస్య వస్తే మండల అధికారులు, ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితంలేదని మండిపడ్డారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల సమస్యలను 24 గంటల్లో పరిష్కరించేలా పాలన తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. మళ్లీ సంక్షేమ, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, సింగల్ విండో చైర్మన్‌లు శ్రీరాములరెడ్డి, గోపిరెడ్డి, సర్పంచ్ నీలమ్మ, ఎంపీటీసీ మురుగేష్, రెస్కో డైరెక్టర్ భూపతి, ఎంపీటీసీలు, నేతలు ఇంద్రేష్, శంకర్ పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో మంత్రి పెద్దిరెడ్డి



వివాహ వేడుకల్లో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: మండలంలోని మార్లపల్లెలో మాజీ సర్పంచ్ ఆంటోనిరాజ్ కుమార్తె వివాహ వేడుకల్లో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. బుధవారం పట్టణ పర్యటనలో ఉన్న మంత్రి వివాహ వేడుకల్లో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులతో కలిసి పాల్గొన్నారు. అలాగే పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న మైనార్టీల నేత ఖాజాను మంత్రి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ చెంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము పాల్గొన్నారు.

### నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

సోమల: సదుం, సోమల మండలాల్లో గురువారం రాష్ట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, రెడ్డప్పరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లో వలంటీర్లు, గృహసారథులు,సచివాలయ కన్వీనర్లతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

### దుకాణాలకు వేలం

పలమనేరు: ఈనెల 14 నుంచి మూడు రోజుల పాటు సాగే గంగజాతరకు సంబంధించి స్థానిక గంగమ్మ ఆలయం వద్ద దుకాణాల ఏర్పాటుకు బుధవారం జరిగిన వేలంలో ఆలయానికి రూ.3లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ చైర్మన్ కండల నరేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

### పచ్చిరొట్ట ఎరువులతో అధిక లాభాలు



వేరుశనగ విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు, నేతలు

పెద్దపంజాణి: పచ్చిరొట్ట ఎరువులతో పంటలను సాగు చేసి భూమిలో కలియ దున్నడం వలన భూసారం పెరగడమే కాకుండా నేల స్థితిగతులలో మార్పు వస్తుందని కోగిలేరు సచివాలయ సిరికల్చర్ అధికారి నరేష్ అన్నారు. బుధవారం సర్పంచ్ రమేష్‌బాబుతో కలిసి కోగిలేరు ఆర్బీకేలో జనుము, వేరుశనగ విత్తనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కలిగిన రైతులు ఆధార్‌కార్డు, పాస్ పుస్తకంతో ఆర్బీకే కార్యాలయాలను సంప్రదించాలన్నారు. ఎంపీటీసీ పరంధామ, పీఎస్ గణపతి, వెల్ఫేర్ అసిస్టెంట్ నజీర్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నగదు బహుమతులు



నగదు ఇస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్, దాతలు

వి.కోట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి స్థాయి నుంచి మూడవ స్థానం వరకు ఉత్తమ స్థానాలు సాధించిన వారికి బుధవారం నగదు బహుమతులు ప్రదానం చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన పలువురు సహృదయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పదోతరగతిలో మండలంలో ప్రభుత్వ పాఠశాలలో మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.7వేలు, 5వేలు, 3వేలు పంపిణీ చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దాత సమక్షంలో పట్టణంలోని బాలికల పాఠశాలకు చెందిన పదో తరగతి చదువుతూ మంచి మార్కులు సాధించిన కీర్తన, తోటకనుమ పాఠశాలకు చెందిన తేజ, చింతమాకులపల్లి పాఠశాలకు చెందిన అశోక్‌కుమార్ విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేసి వారిని అభినందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు మేలు చేసింది వైఎస్సార్‌సీపీనే!



పలమనేరు డిపోను పరిశీలిస్తున్న రాజారెడ్డి

పలమనేరు: రాష్టంలోని ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ఆర్టీసీ రాష్ట కమిటీ సభ్యుడు రాజారెడ్డి పేర్కొన్నారు. ఆమేరకు స్థానిక ఆర్టీసీ డిపోను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక డీఎం రామక్రిష్ణ, అసిస్టెంట్ డీఎం దినేష్ ఆయన్ను సాదరంగా ఆహ్వానించి శాలువా కప్పి సన్మానించారు. ఆర్టీసీ బలోపేతంకోసం నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మేలు జరిగిందన్నారు. ఆపై ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేశారని తెలిపారు. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఎదుగుదలకు కృషిచేస్తుందని తెలిపారు.

# నేడు గృహసారథులతో మంత్రి పెద్దిరెడ్డి సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల: రాష్ట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గృహసారథులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అన్నారు. మంత్రి సమావేశంపై ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గృహసారథులతో సమీక్ష నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సంఘమిత్రలతో మంత్రి పెద్దిరెడ్డి నాగిరెడ్డి కల్యాణ మండపంలో సమావేశాన్ని నిర్వహిస్తారని తెలిపారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, ఎంపీడీఓ రాజేంద్ర, ఎంపీటీసీలు విజయశేఖర్, రహీమాబి, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, అన్సర్‌బాషా, హేమలత, రమణయ్య, గృహసారథులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పాలిటెక్నిక్ ఎంట్రెన్స్



పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద పాలిసెట్‌కు హాజరైన విద్యార్థులు

పలమనేరు: పలమనేరులో బుధవారం జరిగిన పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ప్రశాంతంగా జరిగిందని పాలిసెట్ కోఆర్డినేటర్ మహమూద్ తెలిపారు. పట్టణంలోని ఐదు సెంటర్లలో జరిగిన ఈ పరీక్షకు 1,934మంది హాజరు కావాల్సి ఉండగా వీరిలో 1,664 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష జరిగేలా చూసిన సంబంధిత సెంటర్ల నిర్వాహకులు, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**కుప్పంలో..**

కుప్పం: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో పాలిసెట్ ప్రవేశ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 553 మంది దరఖాస్తు చేసుకోగా, 486 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# వేసవి దుక్కులకు సన్నద్ధం

- ఆశాజనంగా మొదలైన ఖరీఫ్ సీజన్
- వేసవి దున్నకాల్లో రైతన్నలు బిజీ
- ఈదఫా సైతం అదునులో వేరుశనగ విత్తనాలు
- ఆర్‌బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

పలమనేరు: నియోజకవర్గంలో వేసవి దుక్కులకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలతో వేసవి దుక్కుల్లో రైతన్నలు బిజీ అయ్యారు. ఖరీఫ్ సీజన్ వేరుశనగ విత్తనాలేసేందుకు ఇప్పటికే ఇళ్లలోని విత్తన వేరుశనగ కాయలను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ఈనెలాఖరులో వ్యవసాయశాఖ రైతులకు వేరుశనగ విత్తనాలందించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇక రైతులకు కావాల్సిన ఎరువులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నట్టు వ్యవసాయశాఖ తెలిపింది.

**ట్రాక్టర్లకు మంచి డిమాండ్..**

కాడెద్దులు కాలం ముగిసింది కాబట్టి రైతులు ట్రాక్టర్లతోనే దున్నకాలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ట్రాక్టర్ ద్వారా దున్నేందుకు గంటకు వెయ్యి దాకా వసూలు చేస్తున్నారు. పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి సరాసరి వేరుశనగ సాగు విస్తీర్ణం 14వేల హెక్టార్లు కాగా ఈ దఫా ఇది మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ చెబుతోంది. ఇది మెట్ట ప్రాంతం కావడంతో 80శాతం మంది రైతులు వేరుశనగ పంటనే సాగుచేస్తారు.

**ఈనెలాఖరు కల్లా సబ్సిడీ విత్తనాలు..**

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మే నెలఖారుకల్లా వేరుశనగ విత్తనాలు గోడౌన్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటికే స్థానిక వ్యవసాయశాఖ సంచాలకులు డివిజన్‌లోని ఏఓలను ఖరీఫ్ సన్నాహాల ప్రణాళికలపై సమావేశాన్ని నిర్వహించారు. జూన్ మొదటి రెండో వారాల్లో అన్నదాతలు ఖరీఫ్‌కు విత్తనాలు వేసేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**ఆర్బీకేల్లో ఎరువులు సిద్ధం..**

గతంలో ఖరీఫ్ వేరుశనగకు ఎరువుల కొరత ఉండేది. కానీ ఈ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రైతులకు జీలుగ, జనుము పంపిణీ జరుగుతోందని స్థానిక ఏడీ అన్నపూర్ణదేవి తెలిపారు. రైతులు సద్వినియోజం చేసుకోవాలని ఆమె కోరారు.

### వసంతోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామిని వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. సాయంత్రం స్వామి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం కల్పించారు.

### విద్యార్థులకు ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చర్చి నిర్వాహకులు, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి

పెద్దపంజాణి: గత మూడు రోజులుగా మండలంలోని రాజుపల్లి ఎస్పీఎం చర్చి ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ రకాల క్రీడలు, కథల పోటీలు నిర్వహించారు. బుధవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, చర్చి పాస్టర్ నరేష్ శ్యాంవేల్, సునీల్, మురళి, రాజేంద్ర పాల్గొన్నారు.

# సియోన్‌మలై ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



ఉత్సవాలకు ముస్తాబవుతున్న సియోన్‌మలై

గుడిపాల: ప్రతి ఏటా మే లో జరిగే సియోన్‌మలై ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యదర్శి కరుణాజాన్ బుధవారం మీడియాకు తెలిపారు. మండలంలోని సంగమంగళం సమీపంలో గల సియోన్‌మలైలో మే 12 నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక నుంచి ఎక్కువ సంఖ్యలో క్రైస్తవ భక్తులు ఇక్కడకు చేరుకుంటారు. తొలిరోజు వేలూరు డయాసిస్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలకు ప్రారంభోత్సవం చేస్తారు. రెండో రోజు పాస్టర్ల ఉపన్యాసాలు, మూడో రోజు పలు రకాల వేడుకలను నిర్వహిస్తారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు వారు తెలిపారు.